# ఆడలంగి

అది నాలుగు వాటాల ఇల్లు. రెండేసి వాటాలు ఎదురెదురుగా వుంటాయి. మధ్యతరగతి కుటుంబాల కోసం ఎగువ తరగతి వాళ్ళు కట్టిన ఇల్లు అది. నాలుగో వాటాలోకి నాలుగు రోజులైంది దంపతులు వచ్చారు. వాళ్ళకు ఒక అమ్మాయి, చంటి బాబు. భర్త పేరు గోపాలం. వాళ్ళతో ఎవరికీ పరిచయం లేకపోయినా, గోపాలం ప్రవర్తన, దినచర్య మాత్రం మిగతా మూడు వాటాల్లోని దంపతుల్లోనూ 'మూకుట్లో మిరపకాయలు వేయించినంత ' పనై ఒకరినొకరు మాట్లాడుకోలేని స్థితి వచ్చింది.

కారణం-

గోపాలం దినచర్య

ఉదయాన్నే లేస్తాడు. లుంగీ ఎగగట్టి, అంట్లు బయట పడేస్తాడు. తొట్టిలో పంపు దగ్గర నీళ్ళు పట్టిపోస్తాడు.

ఈలోగా

పాపలేస్తుంది. పాప కాలకృత్యాలు దగ్గరుండి చూస్తాడు. పళ్ళు తోముతాడు. తలకు నూనె రాసి జడ వేస్తాడు. నీళ్ళు పోస్తాడు. చక్కగా డెకరేట్ చేసి ముందు గదిలో కూర్చోబెడతాడు.

ఇంతలో

భార్య లేస్తుంది-

ఆమె బ్రష్ చేసుకోడం ఆలస్యం కాఫీ ఇస్తాడు.

ఆమె సహాయంతో, లుంగీ గోచీపోసి కట్టుకుని, కాళ్ళ మీద చంటిబాబును పడుకోబెట్టుకుని, జాగ్రత్తగా, ఆడాళ్ళకన్నా తీరవగా నీళ్ళు పోస్తాడు. అదేం ఖర్మమో, ఎప్పుడూ చంటిబాబు ఏడవడు. తల్లి ముట్టుకుంటే చాలు 'కయ్' మంటాడు.

వంటచేస్తాడు.

ఆమె అతనికి వంటలో సాయం చేస్తుంది.

గబగబా భోజనం చేసి, టిఫిన్ బాక్స్‌లో టిఫిన్ పెట్టుకుని, తయారై చకచక సైకిలు మీద ఆఫీసుకు వెళ్ళిపోతాడు.

పాప అక్షరాలు నేర్చుకోడానికి ప్రైవేటుకు వెళ్తుంది.

చంటిబాబు పడుకుంటాడు.

గోపాలం భార్య హాయిగా ఈజీ ఛైర్‌లో కూర్చుని, వీక్లీలో నవల్సో చదువుకుంటుంది.

ఇదంతా చూస్తుంటే-

మిగతా వాటాల్లోని ఆడాళ్ళకు, తమ మొగుళ్ళని ఇలా ఎలా తయారు చెయ్యాలా, వీళ్ళకు పెళ్ళామంటే లెక్క లేకుండాపోయింది. గోపాలంగారు ఎంత మంచివారు? స్త్రీల పాలిట వరం ఆయన. ఆయనతో ఒక్కసారి మాట్లాడే భాగ్యం తమకు కలుగుతుందా? ఇలా పోతున్నాయి వాళ్ళ ఆలోచనలు.

" కాఫీ పొయ్యవోయ్ " అని మొదటివాటాలో భర్త అంటే

" మీరూ ఉన్నారు ఎందుకూ, గోపాలంగార్ని చూడండి. భార్య చక్కగా ఈజీ ఛైర్‌లో పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటే కాఫీ అందిస్తారు. మీరేమో, పైగా కాఫీ ఇచ్చేదాకా కాకిగోల " అంటోంది అతని భార్యామణి.

" పనమ్మాయి వచ్చింది. అంట్లుపడేయవోయ్ " అని రెండోవాటాలో భర్త అంటుంటే-

" చాల్లెండి సంబరం. రాత్రి పన్నెండింటిదాకా సరసాలు. ఆ గోపాలంగార్ని చూసి నేర్చుకోండి. ఈరోజుకి అంట్లు మీరు పడెయ్యండి. రేపటి సంగతి ఆలోచిద్దాం. " అంటూంది అతని శ్రీమతి.

" ఏమేవ్ బుజ్జిముండ బయటకు వెళ్ళింది. దానికి త్వరగా కడిగేయ్ " అని అరుస్తున్నాడు మూడో వాటాలో భర్త.

" అసలు మీరు ఎప్పుడు బాగుపడతారండీ. దేముడు మీకు ఎప్పుడు కళ్ళు తెరిపిస్తాడో ఏమో. గోపాలం అన్నయ్యగార్ని చూడండి. ఎంచక్కా గౌను పైకెత్తి వాళ్ళ పాపకు చక్కగా కడుగుతారు. ఇవాల్టికి కళ్ళు మూసుకుని దానికి కడిగెయ్యండి " అంటూంది ఆయన జీవిత భాగస్వామి.

" ఈ గోపాలంగాడెవడ్రా బాబూ-

మన ప్రాణానికి దాపురించాడు. " తానెద్ద కోతి వనమెల్లా చెరిచిందని " మా

ప్రాణాలు తింటున్నాడు. తక్షణం వాడిని ఈ వాటాలోంచి ఖాళీ చేయించాలి. కానీ ఇప్పటికే ఆలస్యమైపోయిందే. ఆడాళ్ళందరికీ వీడి వికృత చేష్టలు జీర్ణమైపోయాయి. మమ్మల్ని కూడా ఈ పనులన్నీ చేయమంటున్నారు. " అనుకుంటున్నారు మిగతా మూడు వాటాల్లోని మగాళ్ళు.

చివరకు ఒకరోజు ముగ్గురూ సమావేశమై, గోపాలాన్ని ఒక ఒంటరి ప్రదేశానికి తీసుకువెళ్ళి విషయం అడుగుదామని నిర్ణయించుకున్నారు.-

గోపాలం ఈల వేసుకుంటూ, ఇంట్లోంచి సైకిలెక్కి మలుపు తిరుగుతున్నాడు.

" ఏమండోయ్ గోపాలంగారూ " అని వినిపించి అటు చూశాడు. ముగ్గురు మగాళ్ళు. వాళ్ళని ఎక్కడో చూసినట్లుందే. ఆ గుర్తుకు వచ్చింది. తమ ఇంట్లో మిగతా వాటాల్లో వుండే మగాళ్ళే కదూ-

" మీతో ఒక్క క్షణం- "

" ఏమిటి చెప్పండి "

" మీరు ఇంట్లో మీ భార్యకు ఏం సహాయం చేసినా మాకు అభ్యంతరం లేదు. కాని, బయటకు కనపడకుండా, మీ ఇంట్లో పనులు చేసుకోండి. దయచేసి మామాట వినండి. "

" అదా సంగతి- "

నవ్వేడు గోపాలం

" వీడి నవ్వు చావ. వెధవ వంకర నవ్వు నవ్వుతున్నాడు. మా సంసారాల్లో నిప్పులు పోసింది చాలక.

గుర్రుగా అనుకుంటున్నారు ముగ్గురూ.

" మిమ్మల్ని మీ, మీ, భార్యలు నాలాగా ఇంట్లో పనులు చెయ్యమంటున్నారా? నాకు తెలుసు. ఇటువంటి పరిస్థితి వస్తుందని. ఇంట్లో చేసే పనులు ఇంట్లో చేసుకుంటాం అనుకోండి. కాని బయట చేసే పనులు ఇంట్లో ఎలా చేస్తాం చెప్పండి. ఉదాహరణకి చంటాడికి నీళ్ళు పోయడం లాంటివి- "

వీడి నీళ్ళు పొయ్యడం తగలెయ్య. మా ప్రాణాలకు విలన్‌లా తయారయ్యాడు అనుకుంటున్నారు ముగ్గురూ

" సర్లెండి. మా పాట్లు మేం పడతాం లెండి. మేమే వేరే ఇల్లు చూసుకుంటాం " అంటూ ముగ్గురూ తల వంచుకుని వెళ్ళిపోయారు.

" ఏమిటో, నా ఇంట్లో పనులు నేను చేసుకుంటుంటే వీళ్ళ సొమ్మేం పోయింది. " అంటూ గోపాలం సైకిలు తొక్కడం కొనసాగించాడు.

ఇలా రోజులు గడుస్తున్నాయి.

గోపాలం ఇల్లు ఖాళీ చెయ్యలేదు.

అలాగే మిగతావాళ్ళు కూడా ఖాళీ చెయ్యలేదు.

ఒకరోజు

గోపాలం ప్రక్కవాటాలో, రామారావు అంట్లు బయటవేసి, వాకిలి కొబ్బరిచీపురుతో తుడుస్తున్నాడు. వాళ్ళకి పని మనిషి లేదు. నీళ్ళకుండీ చాటుగా కూర్చుని అంట్లు తోముతున్నారు-

సరిగ్గా-

అదే సమయంలో-

గోపాలం నిత్యకృత్యాలు మొదలయ్యాయి.

గోపాలం బయటకు రాకుండా తన పనులు అయిపోవాలనుకున్నాడు రామారావు.

కాని కుదరలేదు. ఇప్పుడు వాడు చూశాడంటే, నన్ను తింటాడు- అనుకుంటున్నాడు రామారావు.

మిగతా రెండిళ్ళలో మగాళ్ళు, గోపాలానికి తోడయిన మరో "మగాడదాన్ని" చూస్తున్నారు కిటికీల్లోంచి.

" అయితే వీడు మారిపోయాడన్నమాట. త్వరలో తాము కూడా ఇలా అయిపోతామన్నమాట. సమయం మించిపోయింది. ఒకరికొచ్చి ఇద్దరికొచ్చి, అర్ధరాత్రి అందరికీ వొచ్చిందన్నట్లు, మన పని గోవిందా " అనుకుంటున్నారు వాళ్ళు ఇద్దరూ.

తల వంచుకుని అంట్లు తోముకుంటున్న రామారావు దగ్గరకు వచ్చాడు గోపాలం.

" మైడియర్ బ్రదర్. నన్ను ఇంట్లో పనులు, ఇంట్లో చేసుకోమని తిట్టారు కదా. ఏమిటాపని. లోపల తోముకోండి అంట్లు, మీ మిత్రులు చూస్తారు- " అన్నాడు.

" సారీ గోపాలంగారూ- నిన్నరాత్రి మా ఆవిడ బాత్‌రూమ్‌లో కాలుజారి పడింది. లేవడం లేదు. వళ్ళంతా నెప్పులు, అందువలన తప్పలేదు. "

" రామారావుగారూ- భార్యకు ఇంటి పనుల్లో సాయపడటంలో తప్పులేదు. ఆమె బాత్‌రూమ్‌లో కాలుజారి పడకపోయినా మీరు ఆమెకు సాయం చెయ్యవచ్చును. ఈపని మగాళ్ళు

చెయ్యాలని, ఈపని ఆడాళ్ళు చెయ్యాలని ఎక్కడా గ్రంథాల్లో ఎవరూ రాసిపెట్టలేదు.

అర్థం చేసుకుంటే అంతా హాయిగా వుంటుంది.

పగలంతా చాకిరీచేసి, రాత్రి కాగానే, భార్య ప్రక్కలోకి రాగానే, పగలంతా చాకిరీ చేసి అలసిపోయిందనే ఇంగిత జ్ఞానం లేకుండా, శృంగార చేష్టలు మొదలు పెడతాం మన మగాళ్ళం. ఇది ఏం న్యాయం చెప్పండి!

అదే, పగలు పనుల్లో మనం కొంచెం సాయం చేశామనుకోండి? ఎంత హాయిగా వుంటుంది? – గోపాలం చెప్తున్నాడు.

" అవును. మిమ్మల్నీ మేము అపార్థం చేసుకున్నాం. " అన్నాడు రామారావు.

" బ్రదర్స్– సమయం వచ్చింది కాబట్టి చెప్తున్నాను. నా భార్యకు గుండె జబ్బు. ఆమెను డాక్టర్స్ గాజుబొమ్మలా చూసుకోమన్నారు. అందుకని ఆమెను ఏపనీ చేయనివ్వను. ఆమె నాకు ఇద్దరు పిల్లల్ని ఇచ్చే ప్రక్రియలో గుండె జబ్బుకు గురైంది. నాకు ఆమె కళ్ళెదుట వుంటే చాలు. కనీసం బొమ్మలాగానైనా సజీవంగా వుంటే చాలు, మురిసిపోతాను– " అంటూ గోపాలం సీరియస్‌గా చెప్తున్నాడు.

కిటికీల్లోంచి – మిగతా రెండు వాటాలు భర్తలూ ఈ మాటలు వింటూ, గోపాలాన్ని ప్రశంసాపూర్వకంగా చూస్తున్నారు.

***